క్లుప్తంగా

వాహనాల తనిఖీ ముమ్మరం



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

ఓదెల: జిల్లా సరిహద్దు ఓదెల మండలం గుంపుల గ్రామశివారులో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద పొత్కపల్లి ఏఎస్సై లచ్చిరెడ్డి ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు ముమ్మరం చేశారు. బుధవారం జిల్లా సరిహద్దు నుంచి వరంగల్, జమ్మికుంట, కాల్వశ్రీరాంపూర్, సుల్తానాబాద్ వైపులకు వెళ్లే పలు వాహనాలను తనిఖీ చేశారు. అక్రమంగా డబ్బులు సరఫరా చేస్తే చట్టరీత్యా చర్యలు తప్పవన్నారు. వెంట తీసుకెళ్లే డబ్బులు, బంగారు ఆభరణాలకు ఆధారాలు ఉండాలని ఏఎస్సై అన్నారు.

ఉగాది పురస్కారాలకు ఒగ్గు కళాకారుడు



ముత్తారం: మండలంలోని లక్కారానికి చెందిన నర్ర సతీశ్‌యాదవ్ అనే ఒగ్గు కథ కళాకారుడు ఉగాది పురస్కారానికి ఎంపిక అయ్యాడు. ఒగ్గు కథ కళాకారుడు బిట్వీన్ డాన్స్ అకాడమీ గ్రాండ్ మాస్టర్ పులిపాక దేవా ఆధ్వర్యంలో నిర్వహించే ఉగాది పురస్కారాలకు ఎంపికయ్యాడు. పెద్దపల్లిలో ఏప్రిల్‌లో జరిగే కార్యక్రమంలో పలువురి ప్రముఖుల చేతుల మీదుగా సతీశ్ ఉగాది పురస్కార అందుకోనున్నారు.

ఆర్థికసాయం అందజేత


నగదు అందజేస్తున్న మాజీ జెడ్పీటీసీ గంట వెంకటరమణారెడ్డి

రామగిరి: మండలంలోని లొంకకేసారం గ్రామానికి చెందిన నాంసాని సుస్మితకు బుధవారం రామగిరి సేవా సమితి సభ్యులతో కలిసి మాజీ జెడ్పీటీసీ గంట వెంకటరమణారెడ్డి ఆర్థికసాయం అందజేశారు. సుస్మిత తల్లిదండ్రులు నాంసాని లక్ష్మి–రాజయ్య గతంలో మృతి చెందారు. 28న సుస్మిత వివాహం జరగనుంది. వారి ఆర్థిక పరిస్థితిపై సేవాసమితి సభ్యులు ఉమ్మడి కమాన్‌పూర్ మాజీ జెడ్పీటీసీ దృష్టికి తీసుకెళ్లగా పలువురు దాతలను సంప్రదించి సాయం అందజేశారు. లయన్స్ క్లబ్ పెద్దపల్లి అధ్యక్షుడు సాదుల వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు మీసాల సత్యనారాయణ, సభ్యులు ఓంకార్ రూ.11వేలు మాజీ వార్డు సభ్యురాలు ఓర్రె స్వరూప సదయ్య దంపతులు రూ.10వేలు, సేవాసమితి సభ్యుల ద్వారా రూ.7,500, 100 కేజీల బియ్యాన్ని యువతికి అందజేశారు. మాజీ ఉపసర్పంచ్ వేము కనకయ్య, ఒజ్జ ఓదెలు, కొప్పుల సునీల్, అంజీరాజు, కొయ్యడ పరశురాం, ఈర్ల హరీశ్, హరీశ్ పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు


హోమం నిర్వహిస్తున్న పండితులు, పాల్గొన్న భక్తులు

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీలోని శ్రీభక్తాంజనేయ స్వామి దేవాలయంలో శ్రీసీతారామ, లక్ష్మణ సహిత హనుమాన్ పంచలోహ విగ్రహ ప్రతిష్ఠతో పాటు నవగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా బుధవారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు సుమంత్ కుమారాచార్యులు ఆధ్వర్యంలో అగ్నిప్రతిష్ఠ, మూలమంత్ర హోమం, నవగ్రహ హోమం తదితర పూజలు చేసి విగ్రహాలకు ఫల పుష్ప, ధాన్య వయ్యాది వాసం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

మల్టీపర్పస్ విధానాన్ని రద్దుపర్చాలి

పెద్దపల్లిరూరల్: పంచాయతీల్లో మల్టీపర్పస్ వర్కర్స్ విధానాన్ని రద్దు పర్చాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ముత్యంరావు డిమాండ్ చేశారు. పెద్దపల్లిలో బుధవారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. కార్మికులకు బకాయి పడ్డ వేతనాలు వెంటనే చెల్లించాలన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం 30న మండల కేంద్రాల్లో ధర్నాలు, ఏప్రిల్ 1, 2, 3వ తేదీల్లో విధులు నిర్వర్తిస్తూనే నిరసనలు చేస్తామని పేర్కొన్నారు. నాయకులు ఖాజ, నాగయ్య, లచ్చయ్య, శ్రీనివాస్, వెంకటేశ్, పర్శరాములు, రాజయ్య, నారాయణ తదితరులు ఉన్నారు.

అంధకారంలో కార్పొరేషన్ రోడ్లు

- వీధిదీపాలు లేక నిత్యం ప్రమాదాలు
- ఇప్పటివరకు ఐదుగురు మృతి, పలువురికి గాయాలు
- అయినా పట్టించుకోని అధికారులు



వీధిదీపాలు లేకపోవడంతో అంధకారంగా ఉన్న రోడ్డు

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ పరిధిలోని ప్రగతినగర్, శాంతినగర్, గౌతమినగర్, సంజయ్‌గాంధీనగర్, మాతంగికాలనీ ఏరియాల్లోని రోడ్లపై కార్పొరేషన్ వీధిదీపాలు లేక రాత్రి సమయంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. వీధిదీపాలు లేక రోడ్డు ప్రమాదాలు జరిగి ఐదుగురు మృత్యువాత పడ్డారు, పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. వరుసగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నా కార్పొరేషన్ అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వీధిదీపాలు లేకపోవడమే కారణం..

ప్రగతినగర్‌లో వీధిదీపాలు లేకపోవడంతో చీకట్లో బైక్‌పై వెళ్తున్న ఓ వ్యక్తి గేదెను తప్పించబోయి ప్రమాదానికి గురయ్యాడు. కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఖాజీపల్లిలో పెట్రోల్ బంక్ ఎదురుగా లారీ ఢీకొనడంతో ఒకరు మృతి చెందారు. ఈ ప్రమాదాలు కేవలం వీధిదీపాలు లేకపోవడంతోనే జరిగాయని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. వీధిదీపాలు ఉండి ఉంటే రోడ్డుపైన ఏది ఉన్నా గమనించి జాగ్రత్తగా ఉండేవారని వారు వాపోయారు. ఇప్పటికైనా కార్పొరేషన్ పరిధిలోని గౌతమినగర్ నుంచి ఎఫ్‌సీఐ క్రాస్‌రోడ్డు వరకు వీధిదీపాలు ఏర్పాటు చేయాలని స్థానికులు అధికారులను విన్నవిస్తున్నారు.

సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలి



ఆర్‌ఎఫ్‌సీఎల్ యాజమాన్యం చొరవ చూపి సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు అధికారులు చర్యలు చేపట్టాలి. గౌతమినగర్ రైల్వే గేట్ నుంచి ఎఫ్‌సీఐ క్రాస్‌రోడ్డు వరకు సెంట్రల్ లైటింగ్ నిర్మాణ పనులు చేపట్టాలి. కార్పొరేషన్, ఆర్‌ఎఫ్‌సీఎల్ అధికారులు స్పందించి లైట్లు ఏర్పాటు చేయాలి.
– పల్లె హరీశ్‌రెడ్డి, శాంతినగర్

అధికారుల దృష్టికి తీసుకెళ్తాం



గౌతమినగర్ రైల్వేగేట్ నుంచి ఎఫ్‌సీఐ క్రాస్‌రోడ్డు వరకు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని ఆర్‌ఎఫ్‌సీఎల్ యాజమాన్యం దృష్టికి తీసుకెళ్తాం. రోడ్డుపై వందలాది యూరియా లారీలు, అమ్మోనియా ట్యాంకులు ప్రయాణిస్తున్నాయి. వీధిదీపాలు ఏర్పాటు చేయాలని కార్పొరేషన్, ఆర్‌ఎఫ్‌సీఎల్, ఎన్టీపీసీ యాజమాన్యాలకు వినతిపత్రం అందించాం.
– జెట్టి జ్యోతి, కార్పొరేటర్, 39వ డివిజన్

ప్రమాదకరంగా డివైడర్లు



గౌతమినగర్ నుంచి ఎఫ్‌సీఐ క్రాస్‌రోడ్ వరకు ప్రయాణించే వాహనదారులు భయంభయంగా ప్రయాణిస్తున్నారు. ప్రగతినగర్ వద్ద వీధిదీపాలు లేకపోవడంతో నెలలో రెండు, మూడు ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రగతినగర్‌లో గేదె అడ్డురావడంతో రోడ్డు డివైడర్‌కు ఢీకొని ప్రమాదం జరిగింది. ఒకరు చికిత్స పొందుతూ మృతి చెందారు. – పొన్నం రజిత, ప్రగతినగర్

కనులపండువగా విగ్రహాల ప్రతిష్ఠాపన


పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే విజయరమణారావు

జూలపల్లి: మండలంలోని కుమ్మరికుంటలో నూతనంగా నిర్మించిన శ్రీసీతారామచంద్ర స్వామి సమేత లక్ష్మణ హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు బుధవారం కనుల పండువగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణ మధ్య సీతారామచంద్ర స్వామి సమేత లక్ష్మణ, హనుమాన్ విగ్రహాలకు శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజల అనంతరం ఆలయంలో వేదపండితులు కొండపాక కృష్ణమాచార్యులు, రామానుజాచార్యులు, వెంకటచార్యులు విగ్రహాలను ప్రతిష్ఠించారు. అనంతరం ఆలయ శిఖర, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన చేశారు. ఈ సందర్భంగా హాజరైన భక్తులకు అన్నదానం నిర్వహించారు.

పెద్దపల్లి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు..

నూతనంగా నిర్మించిన ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలలో బుధవారం ఎమ్మెల్యే విజయరమణారావు పాల్గొని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు సమర్పించారు. ఎమ్మెల్యే వెంట మాజీ సర్పంచ్ సంతోష్‌రావు, ఎంపీటీసీలు మల్లేశ్‌యాదవ్, దండె వెంకటేశ్, వేణుగోపాలరావు, రవీందర్‌రెడ్డి, సర్పంచుల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు నర్సింహయాదవ్, కుంట రాజేశ్వర్‌రెడ్డి, కొత్త మల్లేశ్, రవీందర్‌రావు, స్వామి ఉన్నారు.

హాజరైన మాజీ మంత్రి

మండలంలోని కుమ్మరికుంటలో బుధవారం నిర్వహించిన శ్రీసీతారామచంద్ర స్వామి విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన ఉత్సవంలో మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ పాల్గొని పూజలు చేశారు. అదేవిధంగా బీఆర్‌ఎస్ మాజీ అధ్యక్షుడు, వెంకట్రావుపల్లెకు చెందిన రేచవేని శ్రీనివాస్ అనారోగ్యానికి గురి కాగా ఆయనను పరామర్శించారు. మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్‌సింగ్ ఉన్నారు.

రోడ్డుపై ఇసుక లారీలు.. ప్రయాణికుల ఇబ్బంది


రోడ్డుపై నిలిచిన ఇసుక లారీలు

ముత్తారం: మంథని నుంచి ముత్తారం మండలం ఖమ్మంపల్లికి వెళ్లే ప్రధాన రోడ్డుపై బుధవారం ఇసుక లారీలు నిలవడంతో వాహనాదారులు, ప్రయాణికులు ఇబ్బందులకు గురయ్యారు. మంథని మండలం గోపాలపూర్ క్రాస్‌రోడ్డు నుంచి ముత్తారం మండలం సీతంపల్లి బస్టాండ్ వరకు వందల లారీలు రోడ్డుపై నిలపడంతో స్థానికులు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు వెళ్లే ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. చర్యలు తీసుకోవాలని వాహనాదారులు డిమాండ్ చేస్తున్నారు.

సాగునీటి కొరత.. ఎండుతున్న పంటలు


కాల్వశ్రీరాంపూర్ మండలం పెద్దరాతుపల్లిలో ఎండిపోయిన వరి


ఓదెల: నాంసానిపల్లిలో అడుగంటిన చెరువు


ఓదెల: గుంపులలో ఎండిపోయిన మానేరు


కాల్వశ్రీరాంపూర్: బావిలో పూడిక తీయిస్తున్న రైతు


సుల్తానాబాద్‌రూరల్: అడుగంటిన గర్రెపల్లి చెరువు

- చెరువుల్లో తగ్గుతున్న నీటిమట్టం
- ఆందోళనలో అన్నదాత

కాల్వశ్రీరాంపూర్: ఎస్సారెస్పీ ఆయకట్టు చివరి భూముల రైతాంగం సాగునీటికి తిప్పలు పడుతున్నారు. సాగుచేసిన పంటను కాపాడుకునేందుకు క్రేన్ల సాయంతో బావుల్లో పూడిక తీస్తున్నారు. వరి, మొక్కజొన్న, మిరప పంటలు ఎండిపోతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. చివరి భూములకు సాగునీరందించి పంటలు కాపాడాలని అన్నదాతలు వేడుకుంటున్నారు.

నాంసానిపల్లెలో ఎండిపోతున్న చెరువు

ఓదెల: ఎండల తీవ్రతతో చెరువులు, కుంటలు ఎండిపోతున్నాయి. మండలంలోని నాంసానిపల్లె ఊర చెరువు ఎండిపోవటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎస్సారెస్పీ కాలువనీరు చెరువులోకి రాకపోవటంతో ఉన్ననీరు సరిపోక పంటలు ఎండిపోయే పరిస్థితులు ఏర్పడ్డాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాంసానిపల్లె చెరువు కింద వేల వరిపంటల ఎకరాలు సాగయ్యాయి. ప్రస్తుతం వరిపొలాలు ఇంకా పొట్టదశలోనే ఉండటం, మరోవైపు చెరువులు ఎండిపోతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పంపుమోటార్లతో పంటలకు నీళ్లు పెడతున్నామని, సంబంధిత శాఖాధికారులు చోద్యం చూస్తున్నారని ఆరోపించారు.

చెరువుల్లో తగ్గుతున్న నీటిమట్టం

సుల్తానాబాద్‌రూరల్: ఎండాకాలం ప్రారంభంలోనే రోజురోజుకూ పెరుగుతున్న ఎండల తీవ్రతతో చెరువుల్లోని నీటిమట్టం తగ్గడంతో సాగుకు, తాగునీటికి రాబోయే రోజుల్లో ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితులు నెలకొంది. సుల్తానాబాద్ మండలంలోనే విస్తీర్ణంలో పెద్దదైన గర్రెపల్లి చెరువు కాగా గత సంవత్సరం జూలైలో నిండుకుండలా ఉండగా ప్రస్తుతం ఎండల తీవ్రతతో 80శాతం నీటి మట్టం తగ్గిపోయింది. దీంతో చెరువు కింద సాగు చేసిన పంటలు ఎండిపోయే పరిస్థితి ఉండగా మరోవైపు పశువులకు తాగునీటి కష్టాలు తప్పేటట్లు లేవు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం


కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

సుల్తానాబాద్: పట్టణంలోని శ్రీసంతాన వేణుగోపాలస్వామి ఆలయ పరిధిలో ఉన్న శ్రీసాంబశివ ఆలయంలో శివపార్వతుల కల్యాణ మహోత్సవం వైభవంగా పేద పండితులు చంద్రశేఖరశర్మ నిర్వహించారు. బుధవారం రాత్రి నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా పల్లకి సేవలో శివపార్వతులను ఊరేగింపు పట్టణంలో నిర్వహించిన అనంతరం పూజారులు చంద్రశేఖర శర్మతో పాటు రమేశ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ పల్లామురళి, శ్రీశివాలయం కమిటీ చైర్మన్ అల్లంకి సత్యనారాయణ, ఆనందం, ఆర్యవైశ్య మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు పల్లా అపర్ణ, జనార్దన్, మారుతి, సిరిపురం రమేశ్, భాస్కర్, రాజు, శరత్ పాల్గొన్నారు.

గాయత్రి కాలేజీలో వీడ్కోలు హంగామా


నృత్యం చేస్తున్న విద్యార్థులు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలోని గాయత్రీ డిగ్రీ, పీజీ కాలేజీలో బుధవారం వీడ్కోలు హంగామా జరిగింది. ప్రస్తుత కాలంలో ప్రతిభా, నైపుణ్యాలు గల విద్యార్థులకే ఉన్నత స్థానాన్ని చేరుకునే అవకాశాలు దక్కుతామని విద్యాసంస్థల అధినేత అల్లెంకి శ్రీనివాస్ అన్నారు. ప్రతి ఒక్కరూ లక్ష్యాన్ని ఎంచుకుని దాన్ని సాధించేందుకు ముందుకు సాగాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఇచ్చిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరింపజేశాయి. ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లకు శాతవాహన యూనివర్సిటీ వికల్ప, ప్రేరణ ఆరోహణ–2024లో పాల్గొన్న వారికి ప్రశంసాపత్రాలను అందించారు. ప్రిన్సిపాల్ రవీందర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

బీజేపీ మండల కార్యవర్గ నియామకం


నూతనంగా నియామకమైన మండల కార్యవర్గం

ఎలిగేడు: మండల కేంద్రంలోని శ్రీకోదండరామాలయంలో బుధవారం పెద్దపల్లి పార్లమెంట్ ప్రభారి అనుముల్ల పోచం, బీజేపీ మండల అధ్యక్షుడు కోదాటి వెంకటరమణారావు ఆధ్వర్యంలో మండల కార్యవర్గాన్ని, వివిధ మోర్చాలను నియమించారు. బీజేపీ మండల ఉపాధ్యక్షులుగా కొత్తిరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, బద్దం మల్లారెడ్డి, కోట కనుకయ్య, ప్రధాన కార్యదర్శులుగా గడ్డం సతీశ్‌రెడ్డి, ఎడ్ల సతీశ్, కార్యదర్శులుగా మారం శ్రీనివాస్, కచ్చు కుమార్, కోశాధికారిగా శ్రీనివాస్, యువమోర్చా అధ్యక్షుడిగా ఆకుల బాలు, ఓబీసీ మోర్చా అధ్యక్షుడిగా అమరగొండ విజయ్, ఎస్సీమోర్చా అధ్యక్షుడిగా ఆసంపల్లి రవీందర్, కిసాన్‌మోర్చా అధ్యక్షుడిగా ఎలుక శంకర్, కార్యవర్గ సభ్యులుగా అనంతరెడ్డి, బూర్ల జనార్దన్, ఏలేటి గంగారెడ్డి నియామకమైనట్లు వారు తెలిపారు. బీజేపీ రాష్ట్ర నాయకులు శిలారపు పర్వతాలు, నాయకులు దాడి సంతోష్, ఈర్ల శంకర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మంథని బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా హరిబాబు



మంథని: మంథని బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కేఎల్‌ఎన్ హరిబాబు మరోమారు ఎన్నికయ్యారు. బుధవారం జరిగిన నూతన కమిటీ ఎన్నికల్లో హరిబాబు పదోసారి అధ్యక్షుడిగా ఎన్నిక కావడం విశేషం. ప్రధాన కార్యదర్శిగా ముస్కుల సహేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా రఘోత్తంరెడ్డి, సహాయ కార్యదర్శిగా విజయ్‌కుమార్, కోశాధికారిగా ఆంజనేయులు, లైబ్రరీ కార్యదర్శిగా ఆర్ల నాగరాజు, సాంస్కృతిక కార్యదర్శిగా కటకం శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

గుడుంబా పట్టివేత


గుడుంబా స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

యైటింక్లయిన్‌కాలనీ: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో గోదావరిఖని టూటౌన్ పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. టూటౌన్ పరిధి వెంకట్రావుపల్లి కేకేనగర్ ఏరియాల్లో టూటౌన్ సీఐ రవీందర్ సిబ్బందితో కలిసి బుధవారం రాత్రి తనిఖీలు చేపట్టారు. కేకేనగర్ ఏరియాలోని ఓ ఇంట్లో సోదా చేసి 5లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకున్నారు. టూటౌన్ రెండో సీఐ లింగమూర్తి, ఎస్సై వెంకటేశ్, సనత్, హెడ్ కానిస్టేబుల్లు కృష్ణారెడ్డి, కనకయ్య ఉన్నారు.

పోషకాహారంతోనే ఆరోగ్యం


అవగాహన కల్పిస్తున్న స్వప్న

పెద్దపల్లిరూరల్: పోషక విలువలున్న ఆహారాన్ని తీసుకోవడంతోనే ఆరోగ్యంగా ఉంటామని మహిళా సాధికారిత కేంద్ర జెండర్ స్పెషలిస్టు స్వప్న, అభినయ్ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఐటీఐలో బుధవారం బేటీ బచావో.. బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా పలు అంశాలపై అవగాహన కల్పించారు. మహిళా చట్టాలతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత విషయంలో పాటించాల్సిన పద్ధతులను వివరించారు. ప్రిన్సిపాల్ నర్సింహాచారి, దత్తాద్రి, దోరుకమ్మ, మధుసూదన్, సాలమ్మ ఉన్నారు.

ఆలయానికి రూ.లక్ష విరాళం


విరాళం అందజేస్తున్న నల్ల మనోహర్‌రెడ్డి

జూలపల్లి: మండలంలోని కుమ్మరికుంటలో నూతనంగా నిర్మించిన సీతారామచంద్రస్వామి ఆలయంలో విగ్రహాల ప్రతిష్ఠాపన ఉత్సవంలో నల్ల మనోహర్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు ఆయనకు స్వామి ఆశీర్వచనాలు అందజేశారు. ఆలయానికి రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. మాజీ సర్పంచ్ సంతోష్‌రావు, ఎంపీటీసీ తమ్మడవేని మల్లేశ్, కుంట రాజేశ్వర్‌రెడ్డి, కొత్త మల్లేశ్, ప్రతాపరెడ్డి తదితరులు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

నేడు లాలపల్లిలో పోచమ్మ బోనాలు

ఎలిగేడు: మండలంలోని లాలపల్లి గ్రామంలో గురువారం రెడ్డి సంఘం ఆధ్వర్యంలో పోచమ్మబోనాలు నిర్వహించనున్నట్లు లాలపల్లి రెడ్డి సంఘం అధ్యక్షుడు బద్దం మల్లారెడ్డి తెలిపారు. ప్రతి రెండేళ్లకోసారి ఉగాది పండుగకు ముందు పోచమ్మ బోనాలు నిర్వహిచడం ఆనావాయితీగా వస్తోందని తెలిపారు. ఈ ఉత్సవాల్లో రెడ్డి సంఘం మహిళలు, నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా కనకయ్య

గోదావరిఖనిటౌన్: బీఎస్పీ రామగుండం నియోజకవర్గ నూతన ఇన్‌చార్జిగా ఇరికిల్ల కనకయ్యను పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మంద ప్రభాకర్ నియమించారు. మంగళవారం రాత్రి హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించి నియామకాన్ని ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడు ఇరికిల్ల రాజనర్సయ్య, నాయకులు కాదాసి రవీందర్, సంతోష్, నరేశ్, జనగామ లింగయ్య, శ్రీనివాస్, అనితాచౌదరి పాల్గొన్నారు.

నియోజకవర్గ కేంద్రాల్లో బీసీల ఆత్మీయ సమ్మేళనం

సుల్తానాబాద్: కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణకు మద్దతుగా నియోజకవర్గ కేంద్రాల్లో బీసీల ఆత్మీయ సమ్మేళనాలు ఏర్పాటు చేస్తున్నట్లు బీసీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఆరె మహేందర్, మున్నూరుకాపు యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దశరథం తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లో చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వెంకటస్వామి వివేక్‌ను కలిసి వివరించారు.

సర్వీస్‌రోడ్డుపై సైన్ బోర్డుల తొలగింపు



పనులను పర్యవేక్షిస్తున్న కమిషనర్ శ్రీకాంత్

కోల్‌సిటీ: గోదావరిఖనిలోని రాజీవ్ ఫోర్‌లేన్‌లోని సర్వీస్ రోడ్లపై బుధవారం నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. స్థానిక శ్రీనగర్ కాలనీ, ప్రశాంత్ నగర్‌లో రాజీవ్ రహదారిలోని సర్వీస్ రోడ్డు నిర్మాణానికి ఆటంకంగా ఉన్న సైన్ బోర్డులు, హోర్డింగ్‌లు, విద్యుత్ స్తంభాలకు వేలాడదీసిన బోర్డులను, ఆక్రమణలను తొలగించారు. ఆక్రమణల తొలగింపు పనులకు అసిస్టెంట్ సిటీ ప్లానర్ శ్రీనివాసరావుతో కలిసి కమిషనర్ పర్యవేక్షించారు.